సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 5 । జూలై । 2024



ప్రత్యేక అధికారుల బాధ్యతలు..

జిల్లాలోని మండల ప్రజా పరిషత్‌ల ఐదేళ్ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారులు గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

9లో▸

పంట వివరాలు నమోదు చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్‌: క్రాప్‌ బుకింగ్‌ యాప్‌ ద్వారా పంటల వివరాలు నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఈ.సురేఖ అన్నారు. గురువారం మంచిర్యాల డివిజన్‌ కార్యాలయంలో ఏవో, ఏఈవోలతో క్రాప్‌ బుకింగ్, రైతుభరోసా, రైతుబీమా పథకాలపై సమావేశం నిర్వహించారు. డీఏవో మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ రైతు పంట క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను వివరించాలని తెలిపారు. డివిజన్‌ వ్యవసాయ, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.0 /26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రి వేళ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

మున్సిపల్‌ టెండర్లు రద్దు

సాక్షి ఎఫెక్ట్‌..

మంచిర్యాలటౌన్‌: 'అభివృద్ధి పనుల్లో సిండికేట్‌' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంచిర్యాల మున్సిపాల్టీలో టెండర్లు రద్దు చేసినట్లు మున్సిపల్‌ కమిషనర్‌ ప్రకటించారు. గత నెల 28న 45 పనులకు ఈ ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు పిలిచారు. కానీ బుధవారం ఆ పనులను ఒక్కో వార్డుకు ఒక్కో కాంట్రాక్టర్‌కు లక్కీడ్రా ద్వారా పాలకవర్గం కేటాయించింది. ఈ విషయమై ప్రచురించడంతో టెండర్లన్నీ రద్దు చేసినట్లు కమిషనర్‌ పేర్కొన్నారు.

పనుల పంపకంపై ఎమ్మెల్యే ఆగ్రహం

మంచిర్యాలటౌన్‌: మంచిర్యాల మున్సిపాల్టీలోని 36 వార్డుల్లో 45రకాల పనులు చేపట్టేందుకు ఒక్కో వార్డుకు రూ.5లక్షలు కేటాయించగా ఆయా పనులను డ్రా పద్ధతిలో పాలకవర్గం కేటాయించడంపై మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెప్మా కార్యాలయంలో చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లు సమావేశమై పనులు పంచడంపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. దీంతో స్పందించిన ఎమ్మెల్యే పనులన్నీ రద్దు చేసి మరోసారి టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు.

విద్యాసంస్థల బంద్‌ విజయవంతం



బాలుర ఉన్నత పాఠశాలలో బహిష్కరణ

మంచిర్యాలఅర్బన్‌: ఎన్‌టీఏ రద్దు చేయాలని, నీట్‌ పేపర్‌ లీకేజ్‌ బాధ్యులపై చర్యలు చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని గురువారం పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌బీ, వైజేఎస్‌ పిలుపు మేరకు మంచిర్యాలలో విద్యాసంస్థల బంద్‌ విజయవంతమైంది. ప్రైవేట్‌ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనగా ప్రభుత్వ పాఠశాలల తరగుతల బహిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌ మాట్లాడుతూ నీట్‌ పేపర్‌ లీకేజీకి బాధ్యత వహిస్తూ నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ చైర్మన్‌ ప్రదీప్‌కుమార్‌ రాజీనామా చేయాలని డిమాండ్‌ చేశారు. పేపర్‌ లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్‌ కేసులు నమోదు చేసి నీట్‌ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకులు రాహుల్, జీవన్‌ రాజు, ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్‌ సన్నీగౌడ్, వైజేఎస్‌ జిల్లా అధ్యక్షుడు సిరాజ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు అరవింద్‌ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- మంచిర్యాల డీసీపీ భాస్కర్‌
- పోలీసుస్టేషన్ల పరిశీలన



డీసీపీ భాస్కర్‌కు మొక్క అందజేస్తున్న ఎస్సై

జన్నారం/లక్సెట్టిపేట: పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని మంచిర్యాల డీసీపీ భాస్కర్‌ అన్నారు. గురువారం ఆయన జన్నారం, లక్సెట్టిపేట మండల కేంద్రాల్లోని పోలీసుస్టేషన్లను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి రికార్డులు తనిఖీ చేశారు. నేరాల వివరాలు తెలుసుకుని శాంతిభద్రతలు కాపాడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని, ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని తెలిపారు. నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఎస్సైలు మొక్క అందజేసి డీసీపీకి స్వాగతం పలికారు. ఏసీపీ ప్రకాశ్, సీఐ నరేందర్, ఎస్సైలు రాజవర్ధన్, చంద్రకుమార్, ధనాజి పాల్గొన్నారు.

ప్రతీ పాఠశాల నుంచి నామినేషన్లు పంపించాలి

మంచిర్యాలఅర్బన్‌: ఇన్‌స్పైర్‌ మనక్‌ అవార్డులకు 2024–25 విద్యా సంవత్సరానికి నామినేషన్లు ప్రారంభమయ్యాయని, ప్రతీ పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు పంపించాలని డీఈవో యాదయ్య సూచించారు. e-mias పోర్టల్‌ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థి ప్రాజెక్టు నామినేషన్లు సెప్టెంబర్‌ 15లోపు సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డీఎస్‌వో మధుబాబును సంప్రదించాలని తెలిపారు.

పనుల పరిశీలన

మంచిర్యాలఅర్బన్‌: స్థానిక హమాలీవాడ పాఠశాలను డీఈవో యాదయ్య గురువారం సందర్శించారు. 'నీళ్లులేక మధ్యాహ్న భోజనం బంద్‌' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. నీటి నిల్వ కోసం నిర్మిస్తున్న వాటర్‌ సంపును పరిశీలించారు. సమస్యలపై ఆరా తీశారు. జాతీయ విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో నాయకులు పాఠశాలలో మౌలిక వసతులపై డీఈవోకు విన్నవించారు.

భూ ఆక్రమణలపై కొరడా

- ప్రభుత్వ భూములపై కలెక్టర్‌ ప్రత్యేక దృష్టి
- చర్యలు తీసుకోవాలని ఆదేశాలు
- జిల్లా వ్యాప్తంగా కబ్జాలపై ఆరా



భీమిని మండలం పెద్దపేటలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని బుధవారం పరిశీలించిన అనంతరం స్థానిక అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ కుమార్‌ దీపక్‌

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సర్కారు భూముల పర్యవేక్షణపై జిల్లా కలెక్టర్‌ కుమార్‌ దీపక్‌ ప్రత్యేక దృష్టి సారించారు. బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములపై వివరాలు తీసుకోవాలని తహసీల్దార్లు, ఆర్డీవోలను ఆదేశించారు. అంతేగాక పలు చోట్ల ఆక్రమణదారులు, ప్రభుత్వానికి మధ్య ఉన్న కోర్టు కేసుల పురోగతిని తెలుసుకున్నారు. ఇక ఆర్డీవో స్థాయిలోనూ సర్కారు భూములపై సమగ్రంగా లెక్కలు తీసుకోవాలని సూచించారు. దీంతో ఏళ్లుగా ఆక్రమణలో మగ్గుతున్న సర్కారు భూములపై కదలిక వస్తోంది. నస్పూర్‌ పట్టణ పరిధిలో 42 సర్వేనంబరులో సర్కారు భూముల ఆక్రమణలపై చర్యలు మొదలయ్యాయి. సర్వేతోపాటు అక్రమ కట్టడాలపై షోకాజ్‌ నోటీసులు ఇస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్న కేసులపైనా దృష్టి సారించారు. ఈ క్రమంలో కలెక్టర్‌ కుమార్‌ దీపక్‌ వీటిపై ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రజాభూములకు రక్షణ కలిగే అవకాశం ఉంది. ప్రస్తుతం తహసీల్దార్లు 'ధరణి' దరఖాస్తుల పరిష్కారంలోనే బిజీగా ఉండడంతో కొంత జాప్యం జరుగుతోంది. పది రోజుల్లో ధరణి దరఖాస్తులు కొలిక్కి వచ్చాక ఆయా మండలాల్లో ఉన్న సర్కారు భూములపై లెక్క పక్కాగా తేలనుంది.

అసైన్డ్‌ భూములు అన్యాక్రాంతం

గత ప్రభుత్వాలు పలు దఫాలుగా పేద, మధ్య తరగతి, దళిత, వెనుకబడిన కులాలకు భూ పంపిణీ చేశాయి. భూమితో ఆర్థికంగా ఎదగాలని తోడ్పాటునిచ్చాయి. చాలా చోట్ల అసైన్డ్‌ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. కొన్ని చోట్ల లబ్ధిదారులకు తెలియకుండా ఆక్రమణలు జరిగాయి. మరికొన్ని చోట్ల అసైన్డ్‌దారులే అమ్మేశారు. ఇక పరిశ్రమల కోసం కేటాయించినవి, సంస్థల స్థాపన, ప్రజోపయోగానికి కేటాయించిన భూముల్లో యథేచ్ఛగా కబ్జాలు సాగాయి. జిల్లాలో 77వేల ఎకరాల వరకు 41వేల మంది రైతులకు భూములు అసైన్డ్‌ చేశారు. ఇప్పటికీ ఎవరి వద్ద ఎంత ఉన్నాయో చెప్పలేని పరిస్థితి. జిల్లా కేంద్రం, పట్టణాలు, గ్రామాల, ప్రధాన రోడ్లకు ఆనుకుని ఉన్న భూములు ఇప్పటికే సాగేతర భూములుగా మారిపోయాయి. కొన్ని చోట్ల రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులు ప్లాట్లు చేసి అమ్మేస్తున్న ఘటనలు ఉన్నాయి. మిగతా రెవెన్యూ భూముల్లోనూ అనేక వివాదాలు ఉన్నాయి. సీలింగ్‌ భూములు, అసైన్డ్‌ భూములు క్రయవిక్రయాలు జరపొద్దని తెలిసినా చాలా చోట్ల చేతులు మారిపోయాయి. తెలంగాణ అసైన్డ్‌ లాండ్స్‌(ప్రొహిబిషన్‌ ఆఫ్‌ట్రాన్స్‌ఫర్‌)యాక్ట్‌–1977 ప్రకారం ఉచితంగా పొందిన వారు విక్రయించకూడదు. ఈ చట్టానికి 2007, 2008లో సవరణ చేసి, కొన్ని నిబంధనలతో రీ అసైన్‌మెంట్‌కు అవకాశం కల్పించారు. దీంతో కొందరు పట్టాదారులయ్యారు. థర్డ్‌పార్టీ తాజాగా కాంగ్రెస్‌ ప్రభుత్వం అసైన్డ్‌ భూములపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికీ జిల్లాలో చాలా భూములు నిషేధిత జాబితాలోనే ఉన్నాయి. పట్టాలకు ధరణిలో దరఖాస్తు చేసుకున్నా తిరస్కరణకు గురవుతున్నాయి.

అనేక చోట్ల ఆక్రమణలు

జిల్లాలో 18 రెవెన్యూ మండలాలు ఉండగా.. వీటి పరిధిలో 382 గ్రామాలు, ఏడు మున్సిపాల్టీలు ఉన్నాయి. చాలా సర్కారు భూములు ఆక్రమణల పాలయ్యాయి. ఉమ్మడి జిల్లా నుంచి కొత్తగా జిల్లా ఏర్పాటైనప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో చాలా చోట్ల ఆక్రమణలు జరిగాయి. ఖాళీగా ఉన్న స్థలాలే కాకుండా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీ, ఐటీఐ కాలేజీలు, పరిశ్రమల కోసం కేటాయించిన భూములు, భూదాన్‌ భూములు, అసైన్డ్, పోరంపోగు, సాగునీటి, దేవాదాయ తదితర శాఖలకు చెందిన చోట్ల కబ్జా అయ్యాయి. వీటిపై గతంలోనూ అధికారులు చర్యలు తీసుకున్నా తిరిగి స్వాధీనం చేసుకోలేకపోయారు. రాజకీయ ఒత్తిళ్లు, కోర్టుల్లో విచారణ జాప్యంతో యథావిధిగా ఉన్నాయి.

జిల్లాలో...

మొత్తం భూమి: 8,81,163 ఎకరాలు
ప్రభుత్వ విభాగాల్లో ఉన్నది, శిఖం భూములు: 3,88,381 ఎకరాలు
అసైన్డ్‌ భూమి 77,665 ఎకరాలు
లబ్ధిదారులు 41,072 మంది
రెవెన్యూ పరిధిలో ఉన్నది: 51,301.75 ఎకరాలు

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న జీఎం సంజీవరెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి శివ్‌ ఆశీష్‌సింగ్‌

జైపూర్‌: ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు, పెళ్లి రోజు సందర్భంగా నివాస ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని, భావితరాలకు చక్కటి గాలి, నీరు అందించాలని శ్రీరాంపూర్‌ జీఎం బి.సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని ఇందారం ఐకే–ఓసీపీ గని ఆవరణలో గురువారం వన మహోత్సవంలో భాగంగా సింగరేణి ఆధ్వర్యంలో 400 మొక్కలు నాటారు. జీఎం సంజీవరెడ్డి జిల్లా అటవీ శాఖ అధికారి శివ్‌ ఆశీష్‌సింగ్, డివిజనల్‌ అటవీ అధికారి వినయ్‌కుమార్‌ సాహుతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాంపూర్‌ ఏరియాలో అధిక సంఖ్యలో మొక్కలు నాటడం జరుగుతుందని, ఈ మహా యజ్ఞంలో పాలుపంచుకున్న ప్రతీ ఉద్యోగి భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించిన వారవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌ సెక్రెటరీ బాజీసైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్‌ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, గని ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, ఏజీఎం ఫైనాన్స్‌ మురళీధర్, రక్షణాధికారి శ్రీధర్‌రావు, డీజీఎంలు అరవిందర్‌రావు, చిరంజీవులు, గని మేనేజర్‌ రవికుమార్, నాగన్న, ప్రాజెక్టు ఇంజనీర్‌ రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్‌ సాగు విస్తరణకు అడుగులు



డ్రిప్‌ను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి(ఫైల్‌)

దండేపల్లి: పెట్టుబడి ఖర్చులు పెరగడం, అధిక నీటి వినియోగం, ఏటేటా దిగుబడులు కూడా తగ్గడం వంటి పరిస్థితులు అన్నదాతకు భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో డ్రిప్‌ ఇరిగేషన్‌ ద్వారా కొంతవరకు సాగునీటి ఇబ్బందుల నుంచి గట్టెక్కవచ్చని ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా డ్రిప్‌ సాగును విస్తరించాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులకు సూచించింది. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆయిల్‌ఫాం సాగుకు మాత్రమే డ్రిప్‌ అమలయ్యేది. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చాక డ్రిప్‌ విధానంపై దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్చించి వ్యవసాయ, ఉద్యానవన పంటలకు 2024–25 వానాకాలం నుంచే డ్రిప్‌ విధానం అమలు చేయాలని నిర్ణయించారు. ఆయిల్‌ఫాంతోపాటు పండ్లతోటలు, కూరగాయల సాగుకు కూడా డ్రిప్‌ విధానం అమలు కానుంది. జిల్లాలో ప్రస్తుతం 2,770 ఎకరాల్లో ఆయిల్‌ఫాం, 19వేల ఎకరాల్లో పండ్లతోటలు, సుమారు వెయ్యి ఎకరాల్లో కూరగాయల తోటలు సాగయ్యాయి. ఈ సీజన్‌లో మాత్రం 1,800 ఎకరాల్లో ఆయిల్‌ఫాం సాగుకు, 810 ఎకరాల్లో ఇతర పంటలు అంటే పండ్లతోటలు, కూరగాయలు, డ్రిప్‌ పద్ధతి ద్వారా సాగయ్యేలా ఉద్యానవన శాఖల అధికారులు ప్రణాళికలు రూపొందించారు. డ్రిప్‌ విధానం ద్వారా పంటల సాగును క్రమేణ పెంచాలని భావిస్తోంది.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం..

డ్రిప్‌ సాగు వైపు రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక రాయితీలు ఇస్తోంది. డ్రిప్‌ పద్ధతిన సాగు చేయడంతో రైతులకు అనేక లాభాలు ఉన్నాయి. తక్కువ నీటిని ఎక్కువ పంటకు అందించవచ్చు. ఇందుకుగాను డ్రిప్‌ కోసం ఆసక్తిగల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం.

– ఉదయ్‌కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి, మంచిర్యాల

రాయితీ ఇలా..

ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం రాయితీపై పరికరాలు అందిస్తుంది. బీసీ సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80శాతం రాయితీ వర్తిస్తుంది. డ్రిప్‌ ద్వారా 50శాతం నీటి ఆదాతోపాటు ఎరువులు, కూలీల ఖర్చు తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఆసక్తిగల రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులో ఏ పంట సాగు చేస్తారో అనే విషయం తెలపాల్సి ఉంటుంది.

ఎంసీహెచ్‌లో కరెంటు కష్టాలు



శిశువును బయటకు తీసుకువచ్చిన దృశ్యం



ఎస్‌ఎన్‌సీయూ వార్డులో శిశువులకు చికిత్స

- రోజంతా విద్యుత్‌ లేక బాలింతలు, శిశువుల ఇక్కట్లు
- నిరుపయోగంగా జనరేటర్‌
- టార్చిలైట్‌ వెలుతురులోనే వైద్య సేవలు

మంచిర్యాలటౌన్‌: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని కాలేజీ రోడ్డులో ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో కరెంటు నిలిచిపోవడంతో బాలింతలు, శిశువులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. బుధవారం ఉదయం నుంచి గురువారం తెల్లవారు జాము వరకు విద్యుత్‌ సరఫరాలో తరచూ అంతరాయంతో చికిత్స పొందుతున్న బాలింతలు, గర్భిణులు, నవజాత శిశువులు ఉక్కపోతతో చీకట్లో గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రికి విద్యుత్‌ సరఫరా చేసే వైరు కాలిపోగా బుధవారం ఉదయమే కరెంటు నిలిచిపోయింది. జనరేటర్‌తో సరఫరా చేసినా సాంకేతిక సమస్యతో రాత్రి పూర్తిగా సరఫరా నిలిచింది. సాధారణ ప్రసవాలు అయిన వారితోపాటు సిజేరియన్‌ ప్రసవాలు జరిగిన వారు 100 మందికి పైగా వార్డుల్లో ఉండగా, 22 మంది చిన్నారులను స్పెషల్‌ న్యూబోర్న్‌ కేర్‌ యూనిట్‌(ఎస్‌ఎన్‌సీయూ)లో ఉంచారు. ఐసీయూలోని బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడగా, వార్డుల్లో ఉన్న బాలింతలు, చిన్నారులు ఉక్కపోత, చీకటితో ఇబ్బందులు పడ్డారు. ట్యాంకుల్లోకి నీరు ఎక్కించలేక మూత్రశాలల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటికీ అవస్థలు పడ్డారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో మరమ్మతులు చేపట్టారు. మూడు గంటలపాటు పూర్తిగా సరఫరా నిలిచిపోవడంతో ఆ సమయంలో గర్భిణులను ఆపరేషన్‌ థియేటర్లకు తీసుకెళ్లి మళ్లీ వార్డుల్లోకి చేర్చారు. సాధారణ ప్రసవాలు టార్చిలైట్‌ వెలుతురులో చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అర్ధరాత్రి దాటాక మరో విద్యుత్‌ వైరుతో తాత్కాలికంగా సరఫరా పునరుద్ధరించారు. అత్యవసర సేవలు అందించే ఆస్పత్రులకు విద్యుత్‌ సరఫరా నేరుగా బోర్డుకు ఇవ్వడంతోపాటు ఏదైనా సమస్య ఏర్పడి వైర్లు కాలిపోతే వెంటనే మరో బోర్డుకు కనెక్షన్‌ మార్చేలా రెండు డమ్మీ బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ సౌకర్యం లేదు. దీంతో విద్యుత్‌ సమస్య జఠిలంగా మారి పూర్తి స్థాయి పునరుద్ధరణకు రోజంతా సమయం పట్టిందని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ హరీశ్‌చంద్రారెడ్డి తెలిపారు. డమ్మీ కనెక్షన్లు ఉంటే 20 నిమిషాల్లోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని, సమస్య పరిష్కారానికి విద్యుత్‌ శాఖ సిబ్బందికి ఎక్కువ సమయం పట్టడం వల్ల సరఫరాలో ఆటంకం ఏర్పడిందని తెలిపారు. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

విషజ్వరాల వ్యాప్తిని అరికట్టాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్‌ కుమార్‌ దీపక్, డీఎంహెచ్‌వో అనిత, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య

- జిల్లా కలెక్టర్‌ కుమార్‌ దీపక్‌

మంచిర్యాలఅగ్రికల్చర్‌: అంటువ్యాధులు, విషజ్వరాల వ్యాప్తిని అరికట్టాలని, డెంగీ నివారణ చర్యలను మన ఇంటి నుంచే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌ కుమార్‌ దీపక్‌ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ అనిత, జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, ఆర్‌ఎంఓ డాక్టర్‌ భీష్మ, జిల్లా సర్వేయలెన్స్‌ అధికారి ఫయాజ్‌లతో కలిసి వైద్యాధికారులు, మున్సిపల్‌ కమిషనర్లు, మండల పరిషత్‌ అభివృద్ధి అధికారులతో డెంగీ, కీటక జనిత వ్యాధుల నియంత్రణ, జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ నెల 31 వరకు డెంగీ మాసోత్సవాలు నిర్వహిస్తామని, ఇందులో భాగంగా దోమల వృద్ధి నిరోధం, కీటక జనిత వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు. వరద ప్రభావిత లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలను పునరావాస ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లా ఆస్పత్రిలో తెలంగాణ డయాగ్నోస్టిక్‌ హబ్‌లో డెంగీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనంతరం సంబంధిత వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.

10లోగా వన మహోత్సవాలు పూర్తి చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్‌: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటేందుకు నిర్దేశించిన లక్ష్యాలను ఈ నెల 10లోగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ కుమార్‌దీపక్‌ అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి మండల పరిషత్‌ అభివృద్ధి అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతులు పూర్తయిన ప్రకారం చెల్లింపులు చేస్తామని అన్నారు. పంచాయతీల్లో సోలార్‌ వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య కీలకపాత్ర



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్‌ కుమార్‌దీపక్‌

మంచిర్యాలఅగ్రికల్చర్‌: తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య తనకంటూ చెరగని ముద్ర వేసుకుని చిరస్మరణీయుడిగా నిలిచారని జిల్లా కలెక్టర్‌ కుమార్‌ దీపక్‌ అన్నారు. దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా గురువారం సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్‌ మోతిలాల్‌తో కలిసి హాజరయ్యారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ సాయుధ పోరాటంలో కొమురయ్య ఆద్యుడని, ఆయన త్యాగం నేటి తెలంగాణ సమాజానికి గణనీయంగా మేలు చేసిందని తెలిపారు. సాధారణ గొర్రెల పెంపకందారుల కుటుంబంలో జన్మించి నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం వీరోచిత పోరాటం చేశారని, వెట్టిచాకిరీ నుంచి ప్రజలను విముక్తి చేసేందుకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ మహనీయులను ఆదర్శంగా తీసుకుని సన్మార్గంలో నడుస్తూ దేశాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్, కలెక్టరేట్‌ ఏవో రాజేశ్వర్, బీసీ వసతిగృహాల సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బుల గోల్‌మాల్‌పై విచారణ

- ఎట్టకేలకు రైతులకు చెక్కులు అందజేత
- సెంటర్‌ ఇంచార్జిపై పోలీసులకు ఫిర్యాదు



రైతులకు చెక్కులు అందజేస్తున్న చైర్మన్‌

జన్నారం: మండలంలోని పొనకల్‌ సింగిల్‌విండో పరిధి బాదంపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతుల డబ్బుల గోల్‌మాల్‌పై గురువారం కార్యాలయంలో విచారణ చేపట్టారు. డీసీవో ఆదేశాల మేరకు సీనియర్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌రావు కార్యదర్శి రాజన్న, బాదంపల్లి సెంటర్‌ ఇంచార్జి రవిలతో వేర్వేరుగా విచారణ జరిపారు. బాదంపల్లి గ్రామానికి చెందిన 14మంది రైతులకు సుమారు రూ.12 లక్షలు రాకపోవడంతో సీపీఐ కార్యదర్శి దాసరి తిరుపతి, బీఆర్‌ఎస్‌ నాయకులు మహేశ్, జనార్దన్‌ ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో డీసీవో విచారణకు ఆదేశించినట్లు ప్రసాదరావు తెలిపారు. విచారణ నివేదికను డీసీవోకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు చెక్కులు అందజేత

రైతులకు ఎట్టకేలకు డబ్బులకు సంబంధించిన చెక్కులు అందజేశారు. విచారణలో సెంటర్‌ ఇంచార్జి గండోరి రవి ఇతర రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు వేసుకుని వారి నుంచి కాజేసినట్లు తేలింది. సింగిల్‌ విండో చైర్మన్‌ అల్లం రవి, డైరెక్టర్లు ప్రశ్నించడంతో రవి తాను వాడుకున్న రూ.11.85 లక్షల చెక్కును రైతులకు ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. రైతులు ఇందుకు అంగీకరించకపోవడంతో కార్యదర్శి రాజన్న రవి ఇచ్చిన చెక్కును తీసుకుని ఆయన సొంత చెక్కులను రైతులకు అందజేశారు. రైతులకు నష్టం జరుగవద్దనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చైర్మన్‌ తెలిపారు. విచారణలో సెంటర్‌ ఇంచార్జి రవి అక్రమానికి పాల్పడినట్లు తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బొగ్గు బ్లాకుల వేలం రద్దు చేయాలి



చెన్నూర్‌లో ప్రధాని దిష్టిబొమ్మ దహనం

చెన్నూర్‌: బొగ్గు బ్లాక్‌ల వేలం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని నిరసిస్తూ స్థానిక కొత్త బస్టాండ్‌ ప్రాంతంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు బ్లాక్‌లను సింగరేణి సంస్థకు ఇవ్వాలని, బొగ్గు గనుల వేలంపై జిల్లా ఎమ్మెల్యేలు స్పందించకపోవడం దారుణమని అన్నారు. శుక్రవారం చలో కలెక్టరేట్‌కు కార్మికులు, ప్రజలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుల రాతిపల్లి నగేశ్, ఉమారాణి, సమ్మక్క, సరిత, మధు, రమాదేవి, రవికుమార్, ప్రభాకర్, లక్ష్మణ్, సంపత్‌ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

లక్సెట్టిపేట: బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఐబీ సమీపంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు దుంపల రంజిత్, వెంకన్న, కాంతక్క, ఎల్లవ్వ, మల్లవ్వ, పోసవ్వ, రజిత పాల్గొన్నారు.

దండేపల్లి: బొగ్గు గనుల వేలాన్ని కేంద్రం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కనిగరపు అశోక్‌ డిమాండ్‌ చేశారు. దండేపల్లి మండలం కోయపోచగూడలో గురువారం పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. నాయకులు లక్ష్మణ్, రాజలింగు, సునీత, లత, ఎల్లయ్య పాల్గొన్నారు.

నేడు చలో కలెక్టరేట్‌



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

శ్రీరాంపూర్‌: బొగ్గు గనుల వేలంను వ్యతిరేకిస్తూ శుక్రవారం చలో కలెక్టరేట్‌ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. గురువారం నస్పూర్‌–శ్రీరాంపూర్‌ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, టీబీజీకేఎస్‌ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచ్‌ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, సీఐటీయూ బ్రాంచ్‌ అధ్యక్షుడు గొల్ల బాలాజీ, ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ చంద్రశేఖర్‌ పాల్గొని మాట్లాడారు. శ్రావణపల్లి బొగ్గు గనిని వేలం వేయడాన్ని నిరసిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ముట్టడించనున్నామని, కార్మికులు, యూనియన్‌ నాయకులు తరలి రావాలని కోరారు. నాయకులు నర్సింగరావు, అఫ్రోజ్‌ఖాన్‌ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయురాలు బదిలీ రద్దు

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలఅర్బన్: చెన్నూర్ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు సౌజన్య బదిలీ ఉత్తర్వులను డీఈవో యాదయ్య రద్దు చేశారు. పాత పాఠశాలలోనే విధులు నిర్వహించాలని సూచించారు. గురువారం 'ఆయన చెబితే చాలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో సదరు ఉపాధ్యాయురాలి బదిలీ రద్దుచేస్తూ డీఈవో యాదయ్య నిర్ణయం తీసుకున్నారు.

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మధుకర్

దండేపల్లి: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దండేపల్లి మండలం ముత్యంపేటకు చెందిన కార్కూరి మధుకర్ నియామకమయ్యారు. ఈమేరకు నిజామాబాద్‌లో జాతీయ ప్రధాన కార్యదర్శి మామిడాల మనోహర్, సౌత్ ఇండియా చైర్మన్ గంప హనుమాన్‌గౌడ్, డైరెక్టర్ మాలెపు నారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బావిలోపడి విద్యార్థి మృతి

లింగాపూర్: ప్రమాదవశాత్తు బావిలోపడి విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కంచన్‌పల్లి గ్రామానికి చెందిన ఆత్రం రామకృష్ణ(15) ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం గ్రామ శివారులోని ఆత్రం విశ్వంబర్‌కు చెందిన వ్యవసాయ బావివద్దకు స్నానం చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు అందులో పడిపోవడంతో మృతి చెందాడు. మృతుని తండ్రి ఆత్రం జగదీశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కొట్టె ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఉచిత శిక్షణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా పరిసర గ్రామాల్లోని నిరుద్యోగ యువకులకు వోల్వో, డంపర్, ట్రక్ ఆపరేటింగ్‌లలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీజీఎం పర్సనల్ అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాసై హెవీగూడ్స్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి, మూడేళ్ల అనుభవం, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్నవారు ఈనెల 10లోగా ఎంవీటీసీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కేకే-5 గనిలోకి ఎస్డీఎల్ యంత్రాలు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిలోకి రూ.కోటి యాభైలక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ఎస్డీఎల్ యంత్రాలను గురువారం ప్రవేశపెట్టినట్లు గని మేనేజర్ అల్లావుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్రాలతో సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. అసిస్టెంట్ మేనేజర్ జశ్వంత్, ఇంజనీర్ నవీన్ కుమార్, సంక్షేమాధికారి కార్తీక్ పాల్గొన్నారు.

ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే

మందమర్రిరూరల్: ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవడం ఎంతో ముఖ్యమని ఏరియా జీఎం మనోహర్ అన్నారు. హైదరాబాద్‌లో కీర్తి అకాడమిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అటెంప్ట్ టూ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు పోటీల్లో కళాకీర్తి శిఖర అవార్డుతో పాటు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు, ప్రశంస పత్రాలు అందుకున్న చిన్నారులను అభినందించారు.

మొక్కలు నాటాలి

లక్సెట్టిపేట: పాఠశాలలో మొక్కలు నాటాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండలంలోని బలరావుపేట ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పాఠశాల ఆవరణలో చెత్త పిచ్చిమొక్కలు లేకుండా చూడాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి మొక్కలు నాటారు.

పాముల కాలం.. జర భద్రం

'బాబోయ్ పాము' అంటూ భయపడే రోజులొచ్చేశాయ్. వర్షాకాలంలో భూమి మొత్తం తడిసి పుట్టల్లో నీరు నిలవడంతో విషసర్పాలు బయట సంచరిస్తుంటాయి. పొలాల గట్లవెంట, పంటచేను సమీపంలోని ఇళ్లు, గుడిసెలు అన్నీ వీటికి ఆవాసాలే. మనిషి ప్రాణాలు తీసే సర్పాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందే. ఇందుకు ముందస్తుగా కొన్ని రక్షణ చర్యలు తీసుకుంటే కొంతవరకు ముప్పు నుంచి బయట పడవచ్చు.

- పొంచి ఉన్న సర్పాల గండం
- పల్లెలు, పంట పొలాల్లో భద్రం
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన



తలమడుగు: ఉమ్మడి ఆదిలాబాద్ అడవుల జిల్లా కావడంతో విషసర్పాల బెడద అధికంగానే ఉంది. ఏటా పాము కాటుతో పలువురు మృత్యువాత పడుతున్నారు. గతేడాది జిల్లాలో 152 మంది పాము కాటు కు గురయ్యారు. ఎండాకాలంలో వ్యవసాయ పనులు ముగిశాక పంటచేలల్లోని గట్లవెంట, బోరియలు, పుట్టల్లో ఇవి ఆవాసం ఉంటాయి. నివాస గృహాలకు సమీపంలోని చెట్ల పొదల్లో, కట్టెల వెంబడి కూడా ఉంటాయి. అయితే వర్షాకాలంలో పొలాలు మొత్తం బురదమయంగా మారడం, వీటి ఆవాసాల్లోకి నీరు చేరడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వివిధ రకాల పాములు బయటికి వచ్చి పొడిభూమి వైపునకు వెళ్తాయి. ఈ క్రమంలోనే సమీపంలో ఇళ్లలోకి వస్తాయి. కోళ్లు, ఎలుకలు సంచరించే గృహాలవైపు ఆహార వేటకు వెళ్తాయి. ఇంటి ఆవరణలో పడేసి ఉన్న వంటచెరకు, తట్టలు, బుట్టలు, బస్తాల చాటు ను ముడుచుకుని అదును కోసం వేచి చూస్తుంటా యి. ఇంటి చూరుల్లోకి చేరుతాయి. వాటి సమీపంలోకి మనుషులు వెళ్లి ఏదైనా పనులు చేస్తున్న క్రమంలో అవి కాటు వేస్తాయి. ఇక పంటచేలలో ప నులు చేసే రైతులు, కూలీలు కూడా పాముకాటుకు గురవుతుంటారు. పచ్చికలు, కలుపు మొక్కల మాటున, గట్ల మీద ఉండే పాముల సమీపంలోకి వెళ్లినప్పుడు వాటి మీద కాలు పడినప్పుడు కాటు వేస్తాయి. ఇలాంటి ప్రమాదాల్లో అనేక మంది చనిపోయిన సంఘటనలున్నాయి.

సర్పాల రకాలు, విష ప్రభావం ఇలా..

విషసర్పాలు రెండు రకాలు ఉంటాయి. ఒకరకం న్యూరోటాక్సిన్ నాగుపాము, రెండో రకం హిమోటాక్సిన్ రక్తపింజర. న్యూరోటాక్సిన్ రకం పాము కాటువేస్తే నోటినుంచి నురుగువచ్చి శ్వాస ఆడక ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది. హిమోటాక్సిన్ రకం పాము కాటు వేస్తే రక్తనాళాల్లోని కణజాలం నశించి కాటువేసిన భాగంలో వాపు వచ్చి క్రమంగా మృతి చెందే అవకాశం ఎక్కువగా ఉంది. నాగుపాము కాటేస్తే పదిహేను సెకన్లలో విషం ఎక్కుతుంది. కట్లపాము కాటేస్తే క్షణంలో రక్తంలోకి ఎక్కుతుంది. రక్తపింజర కాటేస్తే రెండు గంటల తర్వాత విషం ఎక్కుతుంది. జెర్రిపోతు, నీరుకట్టె, వానపాములు కాటేస్తే విషప్రభావం ఉండదు.

అప్రమత్తంగా ఉండాలి

కప్పలు, ఎలుకలు సంచారం ఉన్న ప్రదేశంలో పాముల సంచారం ఎక్కువగా ఉంటుంది. ఇంటి ఆవరణ, పరిసరాల్లో నీటి నిల్వలు, పిచ్చిమొక్కలు లేకుండా చూసుకోవాలి. ఇల్లు కడిగిన తర్వాత నీళ్లు బయటకు వెళ్లే రంధ్రాలు రాత్రి సమయంలో గుడ్డలు పెట్టి మూసి ఉంచాలి. బయటకు వెళ్తే చెప్పులు లేదా షూ వేసుకోవాలి. రాత్రి సమయంలో చేనువద్దకు వెళ్తే చేతికర్ర, టార్చిలైట్ కచ్చితంగా తీసుకెళ్లాలి. ఇంట్లో పడుకునేటప్పుడు కప్పుకునే దుప్పట్లు బాగా దులపాలి. నవారు, నులక మంచాలను చిన్న కర్రతో కొట్టి అందులో ఏమీలేవని నిర్ధారించుకున్న తర్వాతే వేసుకోవాలి.

కాటేశాక ఆందోళన చెందితే ఇంకా ప్రమాదం

పాముకాటుకు గురైన వారు ఆందోళన చెందకుండా నిర్భయంగా ఉండాలి. భయపడితే గుండెపోటు వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. పాము కాటువేసిన ప్రదేశంలో గట్టిగా కట్టుకట్టాలి. వెంటనే సమీపంలో ఉన్న వైద్యుల వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాలి. విషపూరితమైన పాము కాటువేస్తే శరీరం క్రమంగా నీలిరంగులోకి మారుతుంది. పాముకాటు వేసిన చోట నొప్పి, వాపు ఉంటాయి. కొందరికి పొక్కులు, దద్దుర్లు వస్తాయి. మరికొందరికి నోటి నుంచి నురగలు వస్తాయి. ఆయాసం వచ్చి శరీరమంతా చెమటలు పట్టి కోమాలోకి వెళ్తారు. అప్పుడు సాధారణం కంటే గుండె రెట్టింపు స్థాయిలో కొట్టుకుంటుంది. కచ్చితంగా ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలి. నాటు వైద్యం పసర్లను నమ్మవద్దు.

భయాందోళనకు గురికావొద్దు

"పాముకాటు గురైన వారు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దు. భయపడితే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. కాటు వేసిన వెంటనే కొందరు నాటువైద్యులను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. పాముకాటుకు గురైన వారు జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆరోగ్య కేంద్రంలో పాముకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయి."

– హరీశ్, వైద్యాధికారి, తలమడుగు పీహెచ్‌సీ

వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి!

- న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల రాస్తారోకో



రోడ్డుపై బైఠాయించిన కుటుంబ సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి చెందిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దహెగాం మండలం కల్వాడకు చెందిన గర్భిణి ఇస్రావత్ సవితను కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షల కోసం చేర్పించారు. 9 నెలలు కూడా నిండకపోవడంతో నాలుగు రోజుల క్రితం ఆపరేషన్ చేసినట్లు ఆమె భర్త రమేశ్ తెలిపారు. పుట్టిన పసికందును స్థానిక పిల్లల వైద్య నిపుణుడి వద్దకు తీసుకెళ్లగా ఆరోగ్యంగా ఉందని చెప్పడంతో ఆస్పత్రిలోనే ఉన్నామన్నారు. గురువారం ఉదయం పసికందు మృతి చెందిందని వైద్యులు చెప్పారని ఆయన పేర్కొన్నారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ మృత్యువాత పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన స్థలానికి సీఐ శంకరయ్య, ఎస్సై అంజయ్య చేరుకుని కుటుంబ సభ్యులను సముదాయించడంతో రాస్తారోకో విరమించారు.

ఆర్కే 7లో కార్మికునికి అస్వస్థత

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే 7 గనిలో సాయిని సత్తయ్య అనే కార్మికుడు అస్వస్థతకు గురయ్యాడు. గురువారం గని భూగర్భంలోని 2ఏ17 డీప్, 34 లెవల్‌లో టెండల్ విధులు నిర్వహిస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని గని కార్మికులు తెలిపారు. తోటి కార్మికులు హుటాహుటిని రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెంటిలేషన్ సరిగా లేకపోవడం వల్లే సత్తయ్య అస్వస్థతకు గురయ్యాడని కార్మికులు పేర్కొంటున్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో నిందితుడు

బెల్లంపల్లి: పోలీసులు ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా పొరుగు రాష్ట్రం మహారాష్ట్ర నుంచి గంజాయి అక్రమ రవాణా అవుతూనే ఉంది. కొందరు యువకులు గుట్టుగా కిలోల కొద్ది గంజాయిని రవాణా చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. తాజాగా గురువారం మహారాష్ట్ర నుంచి ఓ యువకుడు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడటం మరోమారు సంచలనమైంది. బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల మేరకు తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు రైల్వేస్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టగా మందమర్రికి చెందిన రవి తేజ అనే యువకుడు బ్యాగుతో అనుమానాస్పదంగా కనిపించాడు. అతడి వద్ద బ్యాగు తనిఖీ చేయగా అందులో 2 కిలోల గంజాయి లభ్యమైంది. మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడు రవితేజను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్యాంక్ ఎక్కి ముదిరాజ్‌ల హల్‌చల్



వాటర్‌ట్యాంక్‌పై ముగ్గురు ముదిరాజ్‌లు

భీమారం: మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్ట్‌లో చేపలు పట్టేందుకు లీజుకు తీసుకుంటే నష్టాలు వచ్చాయని మత్స్య పారిశ్రామిక సంఘానికి చెందిన ముదిరాజ్‌లు సుంకరి దుర్గయ్య, సుంకరి నర్సయ్య, మధు గురువారం మండల కేంద్రంలోని ఇప్పల బొగుడ ప్రాంతంలో గల మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి లీజు విషయమై మత్స్యపారిశ్రామిక సంఘంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ట్యాంక్ దిగి కిందకు వచ్చారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ తాము మూడేళ్ల క్రితం రూ.49 లక్షలకు లీజుకు తీసుకున్నామని, ఈఏడాది జూన్‌తో గడువు ముగిసిందన్నారు. లీజుతో నష్టపోయామని, మరిన్ని నెలలు పొడిగించాలని సంఘం సభ్యులను కోరినా పట్టించుకోలేదని, అందుకే ఆత్మహత్య చేసుకుందామని ట్యాంక్ ఎక్కినట్లు వారు వివరించారు.

నీటి ప్రవాహంలో ఒకరు గల్లంతు



జాదవ్ ప్రకాశ్ (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని కెలికే గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీటిలో కొట్టుకుపోయి గురువారం ఒకరు గల్లంతయ్యారు. జైనూర్ మండలంలోని సంబాజీగూడకు చెందిన జాదవ్ ప్రకాశ్ కెరమెరి మండలంలోని లేండిగూడ నుంచి జైనూర్‌కు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. భారీ వర్షం కురియడంతో మార్గమధ్యలో ఉన్న కెలికే కల్వర్టు దాటుతున్న క్రమంలో వరద తాకిడికి నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్సై గుంపుల విజయ్ ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. రక్షణ చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

బొగ్గు బ్లాకుల వేలం రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పాతమంచిర్యాల: బొగ్గు బ్లాకుల వేలం రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్ మాట్లాడుతూ బొగ్గు బ్లాకుల వేలం రద్దు చేసి సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్ చారి, ప్రేంకుమార్, డీ.మోహన్, బిక్కయ్య, రాజేశం, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'చలో కలెక్టరేట్' విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్: బొగ్గుగనుల వేలాన్ని నిరసిస్తూ శుక్రవారం నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి సెక్రెటరీ ఎస్కె బాజీసైదా కోరారు. గురువారం ఆర్కే 5, ఆర్కే 6, ఆర్కే 7 గనులపై కార్మికులను కలిసి మాట్లాడారు. శ్రావణ్‌పల్లి గనిని సింగరేణికే కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జీఎం దంపతులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో విధులకు గైర్హాజరైన ఉద్యోగులకు గురువారం సీఈఆర్ క్లబ్ ఆవరణలో కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం మనోహర్, సేవా సమితి అధ్యక్షురాలు సవిత మనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావించాలన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే సంబంధిత గని, డిపార్ట్‌మెంట్ అధికారికి తెలియజేస్తే పరిష్కారం లభిస్తుందన్నారు. విధులకు గైర్హాజరైతే సంస్థకు నష్టం చేకూర్చడమే కాకుండా కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. ఇకనైనా ప్రతీనెల తప్పనిసరిగా కనీసం 20 మస్టర్లు చేయాలని అవకాశం ఇచ్చారు. 380 మంది ఉద్యోగులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉండగా 117 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాం సుందర్, ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్ల సంక్షేమాధికారులు, యూనియన్ల ప్రతినిధులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సింగరేణికి బకాయిలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

కాసిపేట: సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన విద్యుత్, బొగ్గు బకాయిలు వెంటనే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడుతూ రూ.28 వేల కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించి సంస్థను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల జెన్‌కో, సిమెంట్ సంస్థలు, పవర్ కంపెనీలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, 2023-24 ఆర్థిక సంవత్సర లాభాల్లో కార్మికులకు 40 శాతం వాటా చెల్లించాలని, సింగరేణిలో తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని, రక్షణ కమిటీల్లో జాతీయ సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు డొనికెల రమేశ్, కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, కారంపూడి శ్రీనివాసరాజు, మాదాసి రవీందర్, లైసెట్టి కమలాకర్, కాసిపేట బీజేపీ మండలాధ్యక్షుడు సూరం సంపత్, గుర్రం ప్రదీప్, మంద రజనీకాంత్, చెట్టి వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయ ముట్టడి



ముట్టడించిన ఐఎన్టీయూసీ నాయకులు

మందమర్రిరూరల్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని నూతన బొగ్గు గనులను వేలం లేకుండా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో గురువారం ఏరియా జీఎం కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణికి తెలంగాణలోని నూతన బొగ్గు గనులను వేలం లేకుండా అప్పగించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, కేంద్ర కమిటీ నాయకులు సమ్మయ్య, నరేందర్, ఏరియా నాయకులు సూర్యనారాయణ, శంకర్‌రావు, సాంబయ్య, లక్ష్మణ్, సదయ్య, రమేశ్, శివ, కల్పన, లలిత, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

జీఎం కార్యాలయం ఎదుట ఐఎన్టీయూసీ ధర్నా

శ్రీరాంపూర్: బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం జీఎం సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు మాట్లాడుతూ కేంద్రం తెలంగాణ పరిధిలోని బొగ్గు గనులను వేలం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ జాతీయ సమితి సభ్యులు భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ గరిగే స్వామి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం



నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బెల్లంపల్లి: బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు అన్నారు. గురువారం మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. దేశ సంపద పేరుతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కార్పొరేట్, పెట్టుబడిదారీ శక్తులకు బొగ్గు బ్లాకులను అప్పగించడానికి కుయుక్తులు పన్నుతోందన్నారు. ఎంతటి పోరాటాలకైనా సిద్ధపడి సింగరేణిని కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.వెంకటస్వామి, బెల్లంపల్లి, గోలేటి బ్రాంచ్‌ల ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, శాంతిఖని గని పిట్ సెక్రెటరీ దాసరి తిరుపతిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీ

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు భూక్య యమున ఇంట్లోకి గురువారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి ఆమె మెడలో ఉన్న రెండుతులాల బంగారు పుస్తెలతాడు అపహరించారు. ఈ క్రమంలో వృద్ధురాలిని బలవంతంగా నెట్టివేయడంతో తలకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న సీఐ నరేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఏఎస్సై పున్నం తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

బెజ్జూర్: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కృష్ణపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాయిని గంగయ్య (65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాధ భరించలేక గురువారం తెల్లవారు జామున ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నెన్నెల: మండలంలోని చిన్నవెంకటాపూర్ గ్రామానికి చెందిన చెల్కల విజయ (35) కిడ్నీలో నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. విజయ మూడేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. బుధవారం పత్తి విత్తనాలు వేయడానికి పంట చేనుకు వెళ్లగా అక్కడ మరోసారి తీవ్రమైన నొప్పి రావడంతో బాధ భరించలేక అక్కడే ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా మంచిర్యాలకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని మిమ్స్‌కు తీసుకెళ్లడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.